క్లుప్తంగా

25న మండల సర్వసభ్యసమావేశం

మెరకముడిదాం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

నేడు హుండీల లెక్కింపు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు ఉంటుందని, ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

23 వరకు ఓటు హక్కు నమోదుకు అవకాశం

బొండపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పట్టభద్రులు ఆన్‌లైన్‌లో నేరుగా తమ వివరాలు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందవచ్చని చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 1,236 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారని వివరించారు. వచ్చే నెల 13న ఎన్నికల నిర్వహణకు బొండపల్లి ఉన్నత పాఠశాలలోని 101, 102 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఎల్లారమ్మకు ప్రత్యేక పూజలు



ఎల్లారమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి ఎల్లారమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈనెల 26, 27,28వ తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. జాతరకు ముందు వచ్చే సోమవారం ఆలయంలో విశేష పూజలు చేస్తుంటారు. అందులో భాగంగానే అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పసుపు, కుంకుమ,గాజులు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

1,276 టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు

బొండపల్లి: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో 1,276 టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని ఎంపీపీ చల్ల చలంనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష్యాల మేరకు ఇప్పటికే రైతుల నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించామని, ఇంకా నిల్వ ఉన్న ధాన్యాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. మండలంలో మిగులు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కోరగా..సమస్యను ఆయన ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు తీసుకువచ్చారని వివరించారు. ఇంకా తమ వద్ద ధాన్యం ఉన్న రైతులు వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫెన్సింగ్‌లో పి.ఎం.పాలెం విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు

గంట్యాడ: మండలంలోని పి.ఎం.పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. కర్నూలులో ఇటీవల నిర్వహించిన పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో పాఠశాల నుంచి బాలురు, బాలికలు 11 మంది పాల్గొన్నారు. వీరిలో తేజశ్రీ, త్రివేణి రజత పతకాలు సాధించగా, శ్యామ్ సుందర్, దిలీప్ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.

గ్రావెల్ అక్రమ రవాణా చేస్తే చర్యలు

గుర్ల: మండలంలోని పోలాయవలస రెవెన్యూ పరిధిలోని చిల్లంగిమెట్ట గ్రావెల్‌ను ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పద్మావతి సోమవారం హెచ్చరించారు. కొండ గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కొండపై గ్రావెల్‌ను తొలగించి భూఆక్రమణలకు పాల్పడుతుండడంతో అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు.

తీరిన విద్యార్థుల వెతలు



పాఠశాలకు ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు



గతంలో పాఠశాలకు వెళ్లే దారి

- పాఠశాలకు రూ.6 లక్షలతో రోడ్డు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పుర్రేయవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వెతలు ఇన్నాళ్లకు తీరాయి. పొలాల మధ్య ఉన్న ఈ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయం లేక విద్యార్థులు వర్షాకాలంలో బురద మట్టి దారిలో నుంచి పాఠశాలకు వెళ్లి, వచ్చేందుకు ఇబ్బందులు పడేవారు. పాఠశాలకు సీసీ రోడ్డు వేయించండని గత ప్రభుత్వం హయాంలో పాలకులు, అధికారులకు స్థానికులు ఎన్నోమార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సమస్య మండల నాయకుల దృష్టికి వెళ్లింది. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ హామీ ఇచ్చారు. రోడ్డు కోసం స్థానిక రైతులతో ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడి స్థల సేకరణ చేశారు. మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ రూ.6 లక్షలు మంజూరు చేయించగా...ఇటీవల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో విద్యార్థుల సమస్య పరిష్కారమైంది.

దళితులకు భూపట్టాలు అందించేందుకు చర్యలు



నెలివాడ దళితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో కొండపోరంబోకు భూమిని సాగుచేసుకుంటున్న దళితులకు పట్టాలు ఇచ్చేలా రెవెన్యూ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నెలివాడ గ్రామానికి చెందిన దళితులు ఎమ్మెల్యే అప్పలనరసయ్యను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 నుంచి గ్రామంలో సర్వే నంబర్ 267లోని 40 ఎకరాల కొండపోరంబోకు భూమిని 58 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని, పట్టాలు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. సంబంధిత భూములను పరిశీలించి, సర్వే చేసి ప్రస్తుతం సాగు చేసుకుంటున్న దళితులకు పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శంకరరావును ఆదేశించారు.

ఇంటింట కుళాయిలకు రూ.72 లక్షలు

నెలివాడ గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకోసం జీలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.72 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయించి ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. గ్రామంలో శ్మశాన వాటికకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు కోరగా.. అందుకు సంబంధించి ప్రతి పాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ జేఈఈ కృష్ణమూర్తికి ఎమ్మెల్యే సూచించారు. ఎంపీపీ చల్ల చలం నాయుడు, రాచకిండాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గొల్లు సతీష్, ఎంపీటీసీ కొమ్మూ నాగమణి తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

రూ.4.98 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం



తుది దశకు చేరుకున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నా యి. రూ.4.98 లక్షల జిల్లా పరిషత్ నిధులతో వీటిని నిర్మిస్తున్నారు. ఆలయం వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తుల తో పాటు జాతర సమయాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చే మహిళా సిబ్బంది అవస్థలు పడాల్సి వచ్చేది. సమస్యను ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జిల్లా పరిషత్ నుంచి రూ.4.98 లక్షలు మంజూరు చేశారు.ఈ నిధులతో పనులను చేపడుతున్నారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో అమ్మవారి జాతర నేపథ్యంలో ఆ సమయానికి మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా పనులను వేగవంతం చేశారు.

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక న్యాయం అందరికీ అందాలి అన్న నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లాలని విద్యార్థులను కోరారు. సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రధాన విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ 2008లో ప్రకటించిందన్నారు. 'అవరోధాలు అధిగమించండి-సామాజిక న్యాయం కోసం అవకాశాలు కల్పించండి' అంటూ ప్రధాన నినాదాన్ని తన సందేశంగా క్యరాజ్యసమితి ప్రకటించిందని చెప్పారు. సమాజంలో అందరికీ సమాన అవకాశాలు, హక్కులు ఉన్నాయని ప్రజలకు యువతరం వివరించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన పెంచండి


- జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు



ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆనందరావు

గజపతినగరం: నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, నవధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.ఆనందరావు సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద సమీపంలో గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, మెంటాడ,దత్తిరాజేరు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరి పంటకు ముందు 8,220 మంది రైతులతో 9,518.31ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేయించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రైతులు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి నవధాన్యాల పంటలను సాగు చేసేలా చైతన్యవంతులను చేయాలని కోరారు. ఖరీఫ్ ప్రధాన పంట వేయడానికి 45 రోజుల ముందు వీటిని సాగు చేయాలని చెప్పారు. పచ్చిరొట్ట ,పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, కాయగూర విత్తనాలు,తీగ జాతి, ఆనప, బీర ఇలా 30 రకాల విత్తనాలను కలిపి ఎకరాని కి 13 కిలోలు చల్లాలని వివరించారు. వీటి సాగువల్ల భూమి గుల్లబారి నీటిని బాగా పీల్చుకుంటుందని, భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి సూక్ష్మ జీవులు వృద్ధి చెంది సహజపద్ధతిలో పంటకు పోషకాలు అందుతాయని చెప్పారు. గజపతినగరం సబ్‌డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, దత్తిరాజేరు, మెంటాడ మండలాల మాస్టర్ ట్రైనర్లు వి.తులసి తదితరులు పాల్గొన్నారు.


మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం: స్థానిక పురిటిపెంట పరిధి బాలాజీనగర్‌లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. 'బాలాజీనగర్‌ను వేధిస్తున్న మురుగు సమస్య' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి విస్తరణ, కల్వర్టు నిర్మాణ పనుల్లో భాగంగా గతంలో ఉన్న కాలువను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో నుంచి మురుగు నీరు ముందుకు మళ్లించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే కాలువ పక్కన ఉన్న ఖాళీ స్థలం హైవే పరిధిలోనిది కాదని, తనదని పూసర్ల మోహన్‌రావు అనే వ్యక్తి మురుగునీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. దీంతో మురుగు నీరు బాలాజీనగర్‌లోని నివాసాలు, ఓ ప్రైవేటు ఆస్పత్రి ముందు నిలిచిపోయింది. సాక్షి కథనానికి స్పందించిన నేషనల్ హైవే డీఈ ఎన్.నరసింగరావు మురుగునీటికి అడ్డుకట్ట వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారితో మాట్లాడి వివాదాస్పద స్థలాన్ని సర్వే చేయించారు. హద్దుల నిర్ధారణ చేసి పంచాయతీ కార్యాలయానికి పూర్తి వివరాలతో మంగళవారం నివేదిక ఇస్తామని, తర్వాత పంచాయతీ అధికారులు మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తారని డీఈ చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనరావు, ఈఓపీఆర్‌డి జనార్దనరావు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు కృషి చేయాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జోనల్ మలేరియా నివారణ అధికారి కృష్ణ ప్రసాద్

బొండపల్లి:

ఫైలేరియా నివారణకు వైద్య సిబ్బంది అంతా కృషి చేయాలని జోనల్ మలేరియా నివారణ అధికారి కృష్ణ ప్రసాద్ కోరారు. దేవుపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలో డీఈసీ(ఫైలేరియా నివారణ) మాత్రల పంపిణీతో పాటు నులిపురుగుల నివారణకు అల్బెండజోల మాత్రలు పంపిణీ ఎంతవరకు పూర్తిచేశారని వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆశ కార్యకర్తలు ప్రజలతో డీఈసీ, అల్బెండజోల్ మాత్రలను దగ్గరుండి మింగించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఎం.తులసీ, వైద్య సిబ్బంది కృష్ణాజీ, డి.వి.రమణ,సత్యవతి పాల్గొన్నారు.

రూ.25 వేల జరిమానా

కొత్తవలస: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి మండల ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్(తహసీల్దార్) డి.ప్రసాదరావు రూ.25 వేలు జరిమానా సోమవారం విధించారు. కేసుకు సంబంధించి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఎస్ఐ పప్పల నరేంద్ర తెలిపిన వివరాలు... మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన కక్కల ముత్యాలు గతేడాది ఆగస్ట్ 2వ తేదిన అయిదు లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. ఎస్ఈబీ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. నిందితుడిపై బైండోవర్ కేసులో భాగంగా పూచీకత్తులపై విడిచిపెట్టారు. అదే ఏడాది నవంబర్- 29న 10 లీటర్ల సారాతో మరోమారు పట్టుబడ్డాడు. నిందితుడు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించాడనిపోలీసులు కేసు నమోదు చేసి మళ్లీ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. విచారణ అనంతరం తహసీల్దార్ నిందితుడికి రూ.25 వేల జరిమానా విధించగా, నిందితుడు నగదు మొత్తాన్ని బ్యాంకు చలానా రూపంలో ఎస్ఈబీ పోలీసులకు చెల్లించాడు. డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధిని పాల్గొన్నారు.

80 శాతం జీవాలకు పీపీఆర్ టీకాలు



ఎల్.కోట మండలంలోని వీరభద్రపేటలో గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

కొత్తవలస: కొత్తవలస సబ్‌డివిజన్‌పరిధి కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో 80 శాతం గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి (పీపీఆర్) నివారణ టీకాలు ఉచితంగా వేశామని పశుసంవర్ధక శాఖ ఏడీ బి.గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జీవాలకు టీకాల వేసే కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. కొత్తవలస మండలంలో 8,837 గొర్రెలు,మేకలు ఉండగా, నేటికి 5,310, లక్కవరపుకోట మండలంలోని 32,822 మేకలు, గొర్రెలు ఉంటే 11,177 జీవాలకు టీకాలు వేశామన్నారు. మిగిలిన జీవాలకు ఈనెల 28వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

వేపాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. అలాగే బరువు తక్కువ పిల్లలు, బడి బయట పిల్లలు, గర్భిణుల వివరాలు సేకరించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల వర్కుబుక్స్‌ను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలభాస్కర్

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలభాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం సోంపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్కుబుక్స్, రైటింగ్ స్కిల్స్, ఉపాధ్యాయుల హాజరు, టీచర్స్ లెసెన్ ప్లాన్, డైరీ, టీచింగ్ నోట్స్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రంలో సదుపాయాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలో సదుపాయాలను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: మార్చి 13న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వేపాడ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్, ఎస్ఐ రాజేష్ సోమవారం సందర్శించారు. పోలింగ్ బూత్ నంబర్ 139లో విద్యుత్, ఫ్యాన్లు, రన్నింగ్ వాటర్ తదితర సదుపాయాలను అధికారులు పరిశీలించారు. కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. ఈ ఈ పోలింగ్ బూత్‌లో మండలానికి సంబంధించిన పట్టభద్ర ఓటర్లు 1,235 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించి ఏఈఆర్ఓగా తహసీల్దార్ కృష్ణంరాజు, డిజిగ్నేషన్ అధికారిగా ఎంపీడీఓ పట్నాయక్ , శాంతిభద్రతల నిర్వహణ అధికారిగా వల్లంపూడి ఎస్ఐ ఎస్.రాజేష్ ఫ్లయింగ్ స్క్వాడ్‌గా హెచ్‌డీటీ సన్యాసినాయుడు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, వీడియో గ్రాఫర్, ఒక కానిస్టేబుల్ పనిచేస్తారని తహసీల్దార్ వివరించారు. అధికారుల వెంట హెచ్ఎం వల్లి, వీఆర్ఓ బాలభాస్కర్ తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



లక్కవరపుకోట: పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

లక్కవరపుకోట: పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని సోంపురం జంక్షన్, గోల్డు స్టార్ జంక్షన్‌లోని పెట్రోల్ బంకుల్లో తహసీల్దార్ టి.రామకృష్ణ, సీఎస్‌డీటీ రామకృష్ణ సోమవారం తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు పెట్రోల్, డీజిల్ నాణ్యత, తూనిక యంత్రాలను పరి శీలించారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం నిల్వలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. బంకుల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

గర్భాంలో..

మెరకముడిదాం: గర్భాంలోని రెండు పెట్రోల్ బంకుల్లో సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు సోమవారం ఆన్‌లైన్ యాప్ ద్వారా తనిఖీలు చేశారు. బంకులు చమురు నిల్వలకు సంబంధించిన రికార్డులతో పాటు పెట్రోల్ నాణ్యతను పరిశీలించారు. నిబంధనల ప్రకారం బంకులు నిర్వహించాలని సంబంధిత బంకుల యజమానులకు సూచించారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస, కోమటిపల్లి వద్ద ఉన్న పెట్రోల్ బంకుల్లో తహసీల్దార్ రమేష్, సీఎస్‌డీటీ ధనం సోమవారం తనిఖీలు చేశారు. పెట్రోల్ నాణ్యత, నిల్వలతో పాటు బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉన్నదీ లేనిది పరిశీలించారు.



దత్తిరాజేరు: మర్రివలసలో పెట్రోల్ నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు



మెరకముడిదాం: గర్భాం పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న సీఎస్‌డీటీ రామారావు

పశువుల అంబులెన్స్ మంజూరు



కొత్తవలస సబ్‌డివిజన్‌కు మంజూరైన పశువుల అంబులెన్స్

కొత్తవలస: కొత్తవలస సబ్‌డివిజన్ పశువైద్యశాలకు ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశుఆరోగ్యసేవ వాహనాన్ని (పశువుల అంబులెన్స్) మంజూరు చేసిందని పశుసంవర్ధకశాఖ ఏడీ బి.గంగాధర్ తెలిపారు. స్థానిక పశువైద్యశాలలో అంబులెన్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్తవలస సబ్ డివిజన్ పరిధిలోని కొత్తవలస, ఎల్.కోట మండలాల పాడిరైతులు ఈ అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. పాడిపశువులు, మూగజీవాలకు అత్యవసర వైద్యం అందించాల్సిన సమయాల్లో పాడిరైతులు 1962 నంబర్‌కు ఫోన్‌ను సంప్రదిస్తే పశువులు, మూగజీవాలు ఎక్కడ అంటే అక్కడికే పశువైద్య సిబ్బంది అంబులెన్స్‌తో వచ్చి సేవలందిస్తారని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో ఎస్.కోట సబ్‌డివిజన్‌కు ఒక అంబులెన్స్ మంజూరైందని గుర్తు చేశారు. అంబులెన్స్‌ల సేవలను పాడి రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం

కొత్తవలస: మండల యూటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని స్థానిక ఎమ్మార్సీలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు జి.వెంకటనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా వై.అచ్చిమాంబ, అధ్యక్షులుగా సీహెచ్.నిర్మలాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.విజయగౌరి, కోశాధికారిగా యు.అరుణకుమారి, ఉపాధ్యక్షులుగా పి.అనురాధ, కె.కృష్ణకుమారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎస్.ప్రసాద్, సీహెచ్.రవికుమార్, వి.సురేష్‌కుమార్, ఎస్.వాసు, పి.రమేష్, టి.వినోద్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.సూరిఅప్పారావు, సభ్యులుగా టి.పద్మావతి, కె.లీల, సీహెచ్.అప్పారావును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

మెనూ ప్రకారం భోజనాలు అందించాలి



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాల ని పథకం నిర్వాహకులకు ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను సోమవారం ఆయన పరిశీలించారు. వంటకాలు రుచికరంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకులు మెనూ అమలుతో పాటు, వంటకాలు రుచికరంగా చేస్తున్నారా లేదా అన్నది నిత్యం పరిశీలించాలని హెచ్ఎం వల్లీకి సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.